చెరువులను అభివృద్ధి చేయండి

- జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- పార్కింగ్ స్థలం లేకుంటే హోటల్స్‌కు అనుమతి ఇవ్వొద్దు

కాప్రా, ఫిబ్రవరి 20 : నియోజకవర్గంలో చెరువులను అభివృద్ధి చేయాలని, వాటిలో పెరుగుతున్న గుర్రపుడెక్కను ఎప్పటికప్పుడు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పాల్గొని నియోజకవర్గం పరిధిలోని పలు సమస్యలపై మాట్లాడారు. చెరువుల అభివృద్ధికి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. గుర్రపు డెక్కను తొలగించడంతో పాటు డ్రైనేజీ, శ్మశానవాటికల్లో సమస్యలు పరిష్కరించాలని, దోమల నివారణకు మరిన్ని మెరుగైన చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లు, వీధిదీపాలు, వీధి కుక్కల స్వైరవిహారం, వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా బోరు మోటర్లకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. పార్కింగ్ స్థలం లేకుండా హోటళ్లు, రెస్టారెంట్లకు అనుమతులు ఇవ్వకూడదని కోరారు.

జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఈ ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌పై మల్లాపూర్ డివిజన్‌లో వివిధ అభివృద్ధి పనులపై మాట్లాడుతున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి.
– మల్లాపూర్, ఫిబ్రవరి 20

స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలి

మల్లాపూర్, ఫిబ్రవరి 20 : ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ ప్రభుదాస్ మేయర్ గద్వాల విజయలక్ష్మిని కోరారు. మంగళవారం జరిగిన జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో స్పోర్ట్స్‌కు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మీర్‌పేట్ డివిజన్ బండబావి మైదానంలో ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలని మేయర్‌కు విజ్ఞప్తి చేశారు.

మాట్లాడుతున్న కార్పొరేటర్ సునీత రాముయాదవ్

శానిటేషన్ సమస్యను పరిష్కరించండి

నేరేడ్‌మెట్, ఫిబ్రవరి 20 : గౌతంనగర్ డివిజన్‌లో శానిటేషన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని సిబ్బందిని పెంచి శానిటేషన్ వ్యవస్థను మెరుగు పరచాలని కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ అన్నారు. మంగళవారం కౌన్సిల్ సమావేశంలో పాల్గొని శానిటేషన్ సమస్యపై మాట్లాడారు. వెంటనే సిబ్బందిని పెంచి శానిటేషన్ సమస్యను పరిష్కరించాలని మేయర్‌ను కోరారు.

శ్రీరంగవరంలో విగ్రహాల ఆవిష్కరణ

మేడ్చల్ మండలంలోని శ్రీరంగవరం గ్రామంలో మాజీ సర్పంచ్ విజయనందరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చత్రపతి శివాజీ, గాంధీ, అంబేద్కర్ విగ్రహాలను మేడ్చల్ జడ్పీటీసీ శైలజా విజయనందరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.
– మేడ్చల్ రూరల్, ఫిబ్రవరి 20

ఘనంగా శివాజీ జయంతి

శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కీసర, ఫిబ్రవరి 20: ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని కీసరలోని శివాజీనగర్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. శివాజీ యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్ ముదిరాజ్, సుధాకర్ రెడ్డి, రమేశ్‌గుప్తా, విజయ్‌రెడ్డి, ఆర్.శ్రావణ్‌కుమార్ గుప్తా, వెంకట్‌రెడ్డి, జంగయ్యయాదవ్, వెంకటేశ్, కె. రమేశ్, ఆర్.ప్రదీప్, బి.శ్రీనివాస్‌రెడ్డి, శివాజీ యువసేన కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణలను తొలగించాలి

కాలనీ సమస్యలు పరిష్కరించాలని డీసీ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మల్కాజిగిరి, ఫిబ్రవరి 20: నిబంధనలకు విరుద్ధంగా రోడ్లను ఆక్రమించి నిర్మించిన ర్యాంపులను తొలగించాలని మచ్చ బొల్లారం డివిజన్ సాయిబాబానగర్ కాలనీ అధ్యక్షుడు మల్లారెడ్డి అన్నారు. మంగళవారం కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అల్వాల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. రోడ్లను ఆక్రమించి ర్యాంపులు నిర్మించడంతో నలబై ఫీట్ల రోడ్డు దాదాపు ఇరవై ఫీట్లకు కుచించుకుపోయిందన్నారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని, కాలనీ పేరును సాయిబాబానగర్ కాలనీగా గుర్తించి సర్కిల్ మ్యాప్‌లో చేర్చాలని కోరారు. ఈకార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సమ్మిరెడ్డి, సుభాష్‌రావు, సుదర్శన్‌రావు, బాలాచారి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో కేసుల పరిష్కారం

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీఆర్.మధుసూదన్‌రావు

చర్లపల్లి, ఫిబ్రవరి 20 : కేసుల సత్వర పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బీఆర్. మధుసూదన్‌రావు పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్ కుషాయిగూడలోని మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కోర్టు భవనంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జడ్జి కిరణ్‌కుమార్, మల్కాజిగిరి డీసీపీ పద్మజ, వివిధ విభాగాల అధికారులతో కలిసి లోక్‌అదాలత్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాతీయ, తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు వచ్చే నెల 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై బీఆర్. మధుసూదన్‌రావు మాట్లాడారు. లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కక్షిదారులు కేసుల సత్వర పరిష్కారానికి ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తులు, వివిధ విభాగాల పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

మల్కాజిగిరి, ఫిబ్రవరి 20: మల్కాజిగిరిలోని మౌలాలి పిల్లి నర్సింగరావు సొసైటీ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సొసైటీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. ఈమేరకు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెంకట్‌రెడ్డి మాట్లాడారు. మౌలాలిలోని యూసుఫ్ బేగానికి చెందిన 3ఎకరాల 28గుంటల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకొని, సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పేదలకు 42గజాల చొప్పున 316మందికి నోటరీలను సొసైటీ తరపున ఇచ్చామన్నారు. ఈ స్థలంపై కోర్టులో ఉన్న కేసు జడ్జిమెంట్ తమ పక్షాన వచ్చిందని తెలిపారు. కానీ కొందరు అక్రమంగా తప్పుడు పత్రాలు తయారుచేసి కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. స్థలాన్ని ఆక్రమించిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈసమావేశంలో కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు లక్ష్మణ్, మంగ, గణేశ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల పై చర్యలు తీసుకోవాలి

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 20 : అక్రమ నిర్మాణాల పై అధికారులు చర్యలు తీసుకోవాలని ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. మండలంలోని చౌదరిగూడలో మంగళవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామా ల్లో అక్రమ నిర్మాణాలపై, నాలాలు కబ్జాలకు గురికాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. చౌదరిగూడ పరిధిలోని 62 కాలనీల్లో మిషన్ భగీరథ నీరు ప్రతి ఇంటికి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ ప్రత్యేక అధికారి సాంబశివరావు, ఎంపీటీసీలు భాస్కర్‌రెడ్డి, రామారావు, ఏఈలు వెంకట్‌రెడ్డి, పరమేశ్వర్, మాజీ వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి కృషి

మల్కాజిగిరి, ఫిబ్రవరి 20 : పేదల ఆరోగ్యానికి కృషి చేస్తున్నామని అల్వాల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సౌందర్యషన్ అన్నారు. మంగళవారం అల్వాల్ వెంకటేశ్వర పార్కులో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 55 సంవత్సరాలకు పైబడిన దాదాపు 70 మందికి బీపీ, షుగర్, కంటి, పంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్ రావు, కేశవరావు, శ్రీనివాస్, రామచంద్ర పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

మేడ్చల్, ఫిబ్రవరి 20 : మండల పరిధిలోని రాజబొల్లారం తండా, గుబ్బడి తండాల్లోని వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం విధించనున్నట్టు పట్టణ ఏఈ శశిధర్ రెడ్డి తెలిపారు. 11కేవీ రాజబొల్లారం తండా ఫీడర్ పరిధిలో చెట్లకొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదు. కాగా, శామీర్‌పేట మండలం లాల్‌గడీ మలక్‌పేట గృహ కనెక్షన్లకు, కంపెనీలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

ఇంటికి రాలేదు..

నాగప్రసన్న (ఫైల్)

జవహర్‌నగర్, ఫిబ్రవరి 20 : ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైంది. ఈఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌వో సీతారాం కథనం ప్రకారం...యాప్రాల్‌కు చెందిన బొమ్మి నాగప్రసన్న(22) ఓ సర్వీసింగ్ సెంటర్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంది. సోమవారం ఇంట్లో చెప్పకుండా స్టడీ సరిఫికెట్స్‌ను తీసుకుని వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె ఆచూకీ కోసం వెతికినా సమాచారం లభించలేదు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో మేస్త్రీ..

రాజేశ్(ఫైల్)

పని కోసమని వెళ్లిన తాపీ మేస్త్రీ అదృశ్యమయ్యాడు. జవహర్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. కౌకూర్‌లోని రాజీవ్ గృహకల్పలో రాజేశ్ కుటుంబసభ్యులతో కలిసి నివాసముంటున్నాడు. గత నెలలో భార్య హౌస్ కీపింగ్ ఉద్యోగం కోసం దుబాయ్ వెళ్లింది. జనవరి 28న రాజేశ్(34) ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి ఇంత వరకు తిరిగి రాలేదు. దీంతో అతడి ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేదు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగానికి వెళ్లి..

కార్తిక్(ఫైల్)

నేరేడ్‌మెట్, ఫిబ్రవరి 20 : ఉద్యోగానికి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం... ఓల్డ్ సఫిల్‌గూడ ద్వారకామయి కాలనీలో నివాసం ఉంటున్న కార్తిక్ (21) కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. ఈ నెల 16న ఉద్యోగానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. అదేరోజు రాత్రి ఫోన్ చేస్తే కలువలేదు. శుక్రవారం నుంచి వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పసలేని అవిశ్వాసం..

జవహర్‌నగర్ తెలంగాణ ఉద్యమకారులు

సమావేశంలో మాట్లాడుతున్న జవహర్‌నగర్ తెలంగాణ ఉద్యమకారులు

జవహర్‌నగర్, ఫిబ్రవరి 20: జవహర్‌నగర్‌లో పెట్టిన అవిశ్వాస తీర్మానం పసలేనిదని, దీంతో ఒరిగిదేమీ లేదని తెలంగాణ ఉద్యమకారులు పేర్కొన్నారు. మంగళవారం కార్పొరేషన్‌లో తెలంగాణ ఉద్యమకారుడు పిన్నోజు సుధాకర్‌చారి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ... ఎమ్మెల్యే మల్లారెడ్డి, మేయర్ మేకల కావ్య చేసిన అభివృద్ధి కండ్ల ముందు కనిపిస్తున్నదన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఉద్యమకారులు ఎప్పుడు అండగా నిలుస్తారని చెప్పారు. 60 ఏండ్లలో చేయని అభివృద్ధిని కేసీఆర్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్లలో చేసి చూపించిందన్నారు. పార్టీ మారే కార్పొరేటర్లు రాజీనామా చేసి వెళ్లాలని, లేకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు ప్రకాశ్, నర్సింహ, సతీశ్‌యాదవ్, కాశీం, ఎల్లస్వామి, శ్రీరాములు, గణేశ్, జలేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ

మేడ్చల్, ఫిబ్రవరి 20 : మండల పరిధిలోని తుర్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు దాసరి ముత్యాలు జ్ఞాపకార్థం దాసరి రవి ఆల్ ఇన్ వన్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో దాసరి అనిల్, రవీందర్‌రెడ్డి, సురేశ్, యాదగిరి, ఆచయ్య, సాయిబాబు, మహేశ్, నరేందర్, దాసరి సంజీవ, దాసరి వీరేశ్, బాలరాజ్, రాజేశ గౌడ్, దాస్, యూత్ అధ్యక్షుడు శ్రీధర్ ముదిరాజ్, షేక్ ఇబ్రహీం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

థీమ్ పార్కు పనుల పరిశీలన

మల్లాపూర్ డివిజన్‌లో అత్యాధునిక హంగులతో ఆహ్లాదంగా రూపు దిద్దుకుంటున్న థీమ్ పార్కు అభివృద్ధి పనులను మంగళవారం కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారులు అశ్విని, స్థానిక నాయకులు పీఆర్.ప్రవీణ్, ఎన్వీ.శ్రీనివాస్, రఘు, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.
– మల్లాపూర్, ఫిబ్రవరి 20

కరపత్రంలో ధర్మకర్త పేరుపై ఖండన

మేడ్చల్, ఫిబ్రవరి 20 : దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలోని ఉప ఆలయమైన శివాలయం నిర్మాణ దాత ఆ ఆలయం వార్షికోత్సవం సందర్భంగా కరపత్రాలు ప్రచురించారు. ఈ కరపత్రాల్లో ఆలయ నిర్మాణ దాతకు బదులు ఆలయ ధర్మకర్త అని ప్రచురించడాన్ని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కందాల నరహరి దేశికాచార్యులు తీవ్రంగా ఖండించారు. ఆలయ నిర్మాణ దాతలు ఇలాంటి పొరపాట్లు మరో మారు చేయొద్దని సూచించారు. లేదంటే దేవాదాయ చట్టం 30/87లోని నిబంధనలు అనుసరించి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అవన్నీ వదంతులే..

మేడ్చల్, ఫిబ్రవరి 20 : పిల్లల్ని ఎత్తుకెళ్లే ముఠాలు శామీర్‌పేట మండలంలో సంచరిస్తున్నట్టు వచ్చిన కథనాలు వదంతులేనని పోలీసులు తేల్చారు. మంగళవారం నలుగురు సభ్యులున్న ముఠా జీనోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాచవాడ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్నారని, నలుగురు పిల్లల్ని ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నం చేయగా స్థానికులు అడ్డుకున్నారని వార్తలు వచ్చాయి. నలుగురు సభ్యుల్లో ఒకరు మాత్రమే దొరికారని, మిగితా ముగ్గురు ఒక పిల్లాడితో పారిపోయారని సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. అయితే స్పందించిన పోలీసులు వెంటనే దర్యాప్తు చేపట్టగా అవి వదంతులేనని తేల్చారు. స్థానికులు అదుపులోకి తీసుకున్న వ్యక్తి ఆ ప్రాంతానికి పనికోసం వచ్చాడని తెలిసింది. తప్పిపోయినట్టు భావించిన బాలుడు అక్కడే ఉన్నాడని పోలీసులు గుర్తించారు.

లక్ష్మయ్య కుంట పరిరక్షణకు చర్యలు

కీసర, ఫిబ్రవరి 20: లక్ష్మయ్య కుంట పరిరక్షణకు తగు చర్యలు తీసుకుంటామని కీసర తాసీల్దార్ అశోక్‌కుమార్ తెలిపారు. కీసర మండల కేంద్రంలోని లక్ష్మయ్య కుంటను ఇటీవల కొంతమంది అక్రమార్కులు కబ్జాకు పాల్పడ్డారు. ఈ విషయంపై స్పందించిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మండల తాసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న చెరువులు, కుంటలను ఎవరూ కబ్జా చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కుంట చుట్టూ హద్దులను కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారి ప్రశాంత్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

కీసర, ఫిబ్రవరి 20: అతివేగంగా వస్తున్న కారు ముందువెళ్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... బొమ్మాలరామారం మండలం రామలింగంపల్లి నుంచి వస్తున్న కారు కీసరగుట్ట కమాన్‌కు చేరువలోని కేజీఎఫ్ వెంచర్ దగ్గర ముందువెళ్తున్న బైక్‌ను ఢీకొట్టింది. అనంతరం చెట్టును ఢీకొట్టి ఆగిపోయింది. ఈ రోడ్డు ప్రమాదంలో కారులో ఉన్న నవీన్‌కు బైక్‌పై వెళ్తున్న మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బాటసారులు గమనించి 108కి సమాచారం అందించారు. 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని గాయాలైన వ్యక్తులను గాంధీ దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. రామలింగంపల్లి గ్రామానికి చెందిన హేమంత్‌రెడ్డి కారుగా పోలీసులు గుర్తించారు.

భార్య ఆత్మహత్య.. భర్తకు 30 నెలల జైలు

మేడ్చల్, ఫిబ్రవరి 20 : భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు మేడ్చల్ న్యాయస్థానం 30 నెలల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. మేడ్చల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణమూర్తి కథనం ప్రకారం... మంచిర్యాలకు చెందిన సుచిన్ రెడ్డి, నీరజారెడ్డికి 2017లో వివాహం జరిగింది. కొద్ది కాలం పాటు సజావుగా సాగిన వీరి కాపురంలో కలతలు చెలరేగాయి. నీరజా రెడ్డికి భర్త వేధింపులు పెరగడంతో భరించలేక 2017 జూలై 3న ఆత్మహత్య చేసుకుంది. నీరజ తల్లిదండ్రులు తమ కూతురు ఆత్మహత్యకు ఆమె భర్త కారణమని జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి, కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. వాదోపవాదాలు విన్న మేడ్చల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి రమేశ్.. నీరజ మృతికి కారణమైన భర్త సుచిన్ రెడ్డికి 30 నెలల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు.

మేడ్చల్ మున్సిపాలిటీలో కమిషనర్ పర్యటన

మేడ్చల్, ఫిబ్రవరి 20 :మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో కమిషనర్ నాగిరెడ్డి మంగళవారం పర్యటించారు. కౌన్సిలర్ మర్రి శ్రీనివాస్ రెడ్డితో కలిసి వివిధ వార్డుల్లో పర్యటించి, సమస్యలను తెలుసుకున్నారు. కౌన్సిలర్ డ్రైనేజీ, రోడ్లు తదితర సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వార్డు పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో ఉచిత వైద్యశిబిరం

కాప్రా, ఫిబ్రవరి 20 : కాప్రా డివిజన్ గాంధీనగర్ కమ్యూనిటీహాలులో ప్రభుత్వ సీఎస్‌సీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 17రకాల వైద్యపరీక్షలు ఉచితంగా చేసి, వాటి రిపోర్టులను అందజేశారు. గాంధీనగర్, పరిసర కాలనీల ప్రజలు ఈ వైద్యశిబిరంలో పాల్గొని చికిత్స చేయించుకున్నారు.

సీసీ ఇవ్వడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు

మేడ్చల్, ఫిబ్రవరి 20 : సీసీకి దరఖాస్తు చేసుకొని వారం రోజులు అవుతున్నా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు ఇవ్వడం లేదని మేడ్చల్ పట్టణానికి చెందిన మహేశ్ మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 1396/ 1968 సీసీ కోసం టీ యాప్ ద్వారా ఈ నెల 13న ఫీజు చెల్లించి, మేడ్చల్ ఎస్ఆర్‌వో కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నానని తెలిపారు. కార్యాలయానికి వెళ్లి సీసీ అడిగితే పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని, సీసీ మాత్రం ఇవ్వడం లేదన్నారు. ఈ విషయం పై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

ఎంహెచ్ఎస్ ప్యానల్ విజయం

నేరేడ్‌మెట్, ఫిబ్రవరి 20 : ముత్యాలరావు కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఎన్నికలు మంగళవారం ముగిశాయి. ఈ మేరకు జూలకంటి జయశ్రీ, కృష్ణదేవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ముత్యాలరావు హౌసింగ్ సొసైటీ, ఎంహెచ్ఎస్ ప్యానల్స్ మధ్య ఎన్నికలు నిర్వహించారు. ఈపోటీల్లో ఎంహెచ్ఎస్ ప్యానల్ సభ్యులు లక్ష్మీనారాయణ రెడ్డి, బాలకృష్ణ , కొండల్ రావు, వెంకటేశ్, రాధ, పి.వేలు, కృష్ణ ఉమేశ్ తదితరులు విజయం సాధించారని ఎన్నికల అధికారి బి.నాగేశ్వర్ రావు తెలిపారు.

ఉప్పల్ ఆర్టీఓగా వాణి

ఉప్పల్, ఫిబ్రవరి 20 : ఉప్పల్ ఆర్టీఓగా వాణి నియమితులయ్యారు. ఈ మేరకు ఆమె మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఉప్పల్ ఆర్టీఏ పరిధిలోని వాహనదారులకు సేవలు అందిస్తామని ఈ సందర్భంగా ఆర్టీఓ తెలిపారు. వాహనదారులు నిబంధనలు పాటిస్తూ, అధికారులకు సహకరించాలని కోరారు.

గార్డెన్ అవార్డుల కోసం పార్కుల ఎంపిక

సంస్కృతి టౌన్‌షిప్‌లోని ఆక్సిజన్ పార్కును పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ అధికారుల బృందం

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 20: ప్రభుత్వం ప్రతి యేడు నిర్వహించే గార్డెన్ అవార్డుల కోసం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని రెండు పార్కులు ఎంపికయ్యాయి. ఈ మేరకు ఉద్యానవన శాఖ అధికారుల బృందం మంగళవారం పార్కులను సందర్శించింది. మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు సంస్కృతి టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ పార్కు, 3వ వార్డులోని ఎల్ఐజీ కాలనీలో రూపుదిద్దుకున్న పంచతంత్ర పార్కును అధికారుల బృందం పరిశీలించి ఎంపిక చేసింది. ఉద్యానవన శాఖ అధికారులు కృష్ణారావు, ప్రవీణ్, టౌన్‌షిప్ అధ్యక్షుడు, 12 వార్డు కౌన్సిలర్ బి.హరిప్రసాద్ రావు, ఏఈ నరేశ్ పాల్గొన్నారు.